సాక్షి అనకాపల్లి

శనివారం । 6 । మే । 2023



ఉత్తరాంధ్ర టూరిస్ట్ హబ్

సీఎం ఆలోచనలకు అనుగుణంగా ఉత్తరాంధ్రలో ఉన్న అపార అవకాశాలను మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి జరుగుతోంది. II లో



గుర్రపు పందేలు II లో

చీడికాడ మండలంలోని పీఎన్ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో రాష్ట్ర స్థాయి గుర్రపు పందేలు ఉత్సాహంగా జరిగాయి.



సింహగిరికి వైశాఖ పౌర్ణమి శోభ

సింహాచలం: వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరికి భక్తులు పోటెత్తారు. వరాహ పుష్కరిణి కిక్కిరిసిపోయింది.

న్యూస్‌రీల్

బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు



మెడల్స్ అందుకుంటున్న క్రీడాకారులు కృష్ణవేణి, మౌనిక

నర్సీపట్నం: సీఎం కప్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో నర్సీపట్నానికి చెందిన ఇద్దరు సీనియర్ ఉమెన్ బాక్సర్లు స్వర్ణ పతకాలు సాధించారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ తిరుపతిలో ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో నర్సీపట్నం నుంచి ముగ్గురు బాక్సింగ్ క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో కోలుకుల కృష్ణవేణి (60 కేజీల విభాగం), బొంతు మౌనిక (80 కేజీల విభాగం) బాక్సింగ్‌లో సత్తా చాటి గోల్డ్ మెడల్స్ సాధించారని శాప్ కోచ్ అబ్బు తెలిపారు. గెలుపొందిన క్రీడాకారులు ద్రోణాచార్య అవార్డు గ్రహీత వెంకటేశ్వరరావు చేతుల మీదగా మెడల్స్ అందుకున్నారు.

సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో దుర్గారెడ్డికి కాంస్యం



కాంస్య పతకం అందుకుంటున్న కాకరాపల్లి క్రీడాకారుడు పృథ్వీసాయి దుర్గారెడ్డి

మునగపాక: కాకరాపల్లికి చెందిన కొల్లి పృథ్వీ సాయి దుర్గారెడ్డి సీఎం కప్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు తిరుపతిలో నిర్వహించిన ఈ రాష్ట్ర స్థాయి పోటీల్లో 92 కిలోల విభాగంలో దుర్గారెడ్డి ప్రతిభ కనబరిచి పతకం కైవసం చేసుకున్నాడు. దుర్గారెడ్డి విశాఖ ఇంజినీరింగ్ కళాశాలలో తృతీయ సంవత్సరం మెకానికల్ ఇంజనీరింగ్ చదువుకుంటున్నాడు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఏపీ ప్రతినిధుల నుంచి సర్టిఫికెట్, మెడల్ అందుకున్నాడు. కాకరాపల్లి సర్పంచ్ కొల్లి ముసిలినాయుడు, ఎంపీటీసీ ఇల్లా శిరీష, తదితరులు దుర్గారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

స్పందన వినతుల పరిశీలన



మునగపాకలో అర్జీదారులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

మునగపాక: స్పందనలో స్వీకరించి, ఇంకా పరిష్కారం కాని వినతులను అసిస్టెంట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి మునగపాక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పరిశీలించారు. ఇరు వర్గాలకు చెందిన వ్యక్తులను రప్పించి పలు సమస్యలు పరిష్కరించారు. పట్టింపులకు పోకుండా రెండు వర్గాల వారు సంయమనం పాటించాలన్నారు. ప్రజా సమస్యలను స్థానికంగా పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాలన్నారు. ఎంపీడీవో రవికుమార్, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఎస్ఐ మహమ్మద్ అలీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

● చిత్రం



ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్న తడవర్తి భాస్కర్‌చౌదరి, ఉలబాల సతీష్‌బాబులకు కొత్తగా కండువాలు కప్పి.. వీరు వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేసి టీడీపీ తీర్థం పుచ్చుకున్నారంటూ వంగలపూడి అనిత హంగామా చేశారు. నాలుగు రోజుల క్రితం ఆదివారంనాడు పాయకరావుపేట పట్టణంలోని చెక్కానగర్‌లో ఈ కార్యక్రమం జరిగింది. వీరితోపాటు 60 మంది వరకు కార్యకర్తలు పార్టీలో చేరినట్టు ఎల్లో మీడియాలో కథనాలు రాయించారు.

● భళారే విచిత్రం



విచిత్రం ఎలాగంటే.. నాలుగు రోజుల క్రితం టీడీపీలో చేరినట్టు అనిత హడావుడి చేసిన నాయకులు (?) గత నెల 20న చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా పాయకరావుపేట పీహెచ్‌సీ వద్ద రొట్టెలు పంపిణీ చేశారు. పార్టీ అధ్యక్షుడు విశాఖ పర్యటనకు వచ్చిన సందర్భంగా స్థానిక నాయకులతో కలసి విశాఖ వెళ్లారు. ఈ సచిత్ర సాక్ష్యాలు చాలు కదా వారు టీడీపీ పాత కాపులే అని చెప్పడానికి..

టికెట్ కోసం తప్పల తిప్పలు

- అధిష్టానం మెప్పు పొందేందుకు అనిత అబద్ధాలు
- టీడీపీ వారికే కండువాలు కప్పి వైఎస్సార్‌సీపీ నేతలని ప్రచారం
- ఆధారాలతో బయటపెట్టిన అధికార పార్టీ నాయకులు
- అభాసుపాలైన అనిత ప్రయత్నాలు

నక్కపల్లి: అధిష్టానం మెప్పు కోసం మాజీ ఎమ్మెల్యే వంగలపూడి అనిత ఆడుతున్న నాటకాలు నవ్వుల పాలవుతున్నాయి. ఎప్పటినుంచో టీడీపీలో ఉన్నవారికి పార్టీ కండువాలు కప్పి వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరారంటూ ఆమె చేసిన ప్రచారం అభాసుపాలైంది. పాయకరావుపేట నియోజకవర్గంలో తనపై ఉన్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకుని అధిష్టానం మెప్పు పొంది మళ్లీ టికెట్ తెచ్చుకునే ప్రయత్నాల్లో భాగంగానే ఆమె ఈ తిప్పలకు పాల్పడుతున్నట్టు సొంత పార్టీలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రజలకు జ్ఞాపక శక్తి బాగా ఉందని, ఇలాంటి అబద్ధాలు వారు ఇట్టే గుర్తు పడతారని వైఎస్సార్‌సీపీ నేతలు ఎద్దేవా చేస్తున్నారు.

అనిత కండువా కప్పిన నాయకులు ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్నారని, ప్రతి పార్టీ కార్యక్రమంలో పాల్గొంటున్నారని వారు సాక్ష్యాలతో సహా నిరూపించారు. చంద్రబాబునాయుడు పుట్టిన రోజు సందర్భంగా గత నెల పాయకరావుపేట పీహెచ్‌సీ వద్ద రొట్టెలు పంపిణీ చేస్తుండగా తీసిన ఫొటో.. వారినే అనిత పార్టీలో చేర్చుకుంటున్నట్టు వెల్లడించిన ఫొటోలు ప్రదర్శించి టీడీపీ పరువు తీశారు. వైఎస్సార్‌సీపీ నేతలులు గూటూరు శ్రీనివాసరావు, దగ్గుపల్లి సాయిబాబా, ధనిశెట్టి బాబూరావు, లంక సూరిబాబులు ఆధారాలతో సహా బయటపెట్టారు. అనిత చెబుతున్నట్లుగా పార్టీలో చేరిన ఇద్దరు నాయకులకు అధికార పార్టీకీ ఎటువంటి సంబంధం లేదన్నారు. తమ పార్టీ నుంచి ఒక్క కార్యకర్త కూడా టీడీపీలో చేరలేదన్నారు. చెక్కానగర్‌లో వైఎస్సార్‌సీపీ బలంగా ఉందన్నారు. అనిత పట్ల నియోజకవర్గంలో రోజురోజుకు పెరుగుతున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకోవడం కోసం మళ్లీ టికెట్ తెచ్చుకునేందుకు అధినేత వద్ద మెప్పు కోసం ఇటువంటి తప్పుడు కార్యక్రమాలు చేస్తున్నారని వారు మండిపడ్డారు. ఇదిలాఉండగా ఆదివారం నాటి కార్యక్రమానికి మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు హాజరు కావలసి ఉందని, అయితే



అనిత కండువాలు కప్పిన వారు తమ పార్టీ వారు కాదని ఆధారాలతో చూపిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

పార్టీలో చేరుతున్నట్టు అనిత చెబుతున్న ఒక వ్యక్తి తుని నియోజకవర్గం కోటనందూరు మండలానికి చెందిన తన అనుచరుడే కావడంతో నవ్వులపాలు కావడం ఇష్టం లేక గైర్హాజరయ్యారని తెలుస్తోంది.

'కాపు' కాసేదిలేదు..

ప్రధానంగా నియోజకవర్గంలో అనిత పట్ల కాపు సామాజికవర్గం చాలా ఆగ్రహంతో ఉంది. ఈ సామాజిక వర్గానికి చెందిన ఒక వ్యక్తిని అనిత ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో చెప్పుతో కొట్టారు. తాజాగా నక్కపల్లి మండలం వేంపాడు పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి గంటాను కలిశారన్న కారణంతో పాయకరావుపేట పట్టణానికి చెందిన **ఇద్దరు సీనియర్ నాయకులు గొర్రెల రాజబాబు, మజ్జూరి నారాయణరావులను పార్టీ నుంచి సస్పెండ్ చేయించారు. ఈ ఇద్దరు నేతలు 2019లో** అనితకు టికెట్ ఇవ్వొద్దంటూ ధర్నాలు, రాస్తారోకోలు చేశారు. వీరికి నాలుగు మండలాలకు చెందిన సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు మద్దతుగా నిలవడంతో అసమ్మతి పంచాయతీ చంద్రబాబు వద్దకు చేరి అనితకు పాయకరావుపేట టికెట్ ఇవ్వలేదు.

2019 నుంచి మూడేళ్లపాటు నియోజకవర్గానికి ముఖం చాటేసిన అనిత ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మళ్లీ పాయకరావుపేటలో పాగా వేసేందుకు పావులు కదుపుతున్నారు. అనిత కాపు సామాజికవర్గ నేతలను టార్గెట్ చేసిందని, 2019లో తనకు వ్యతిరేకంగా పనిచేసిన నాయకులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోందని, మళ్లీ టికెట్ ఇస్తే ఊరుకునేది లేదని అసమ్మతి నేతలంతా మళ్లీ ఏకతాటిపైకి వచ్చి వ్యతిరేకించేందుకు పావులు కదుపుతున్నారన్న ప్రచారం జరుగుతోంది. అసమ్మతి వర్గానికి గంటా అండదండలు పుష్కలంగా ఉండడంతో నియోజకవర్గంలో టీడీపీ వైరి వర్గాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది.

సమన్వయంతో సత్వర న్యాయం



మాట్లాడుతున్న న్యాయమూర్తి గంగరాజు

అనకాపల్లి టౌన్: కక్షిదారులకు సత్వర న్యాయం జరగాలంటే బార్, బెంచ్ ఐక్యంగా పనిచేయాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి గంగరాజు అన్నారు. స్థానిక న్యాయ సముదాయంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తులకు శుక్రవారం స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయస్థానం, న్యాయవాదులు సమన్వయంతో పనిచేస్తే కేసులు త్వరగా పరిష్కారమవుతాయన్నారు. ఈనెల 13న జరిగే లోక్ అదాలత్ కార్యక్రమానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పేర్కొన్నారు. పలువురు న్యాయమూర్తులు మాట్లాడుతూ ఎవరెక్కడ పని చేసినా ప్రజలకు న్యాయసేవలు సక్రమంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రదీప, రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి విజయలక్ష్మి, మూడో అదనపు జూనియర్ సివిల్ జడ్జి రవి కిరణ్, స్పెషల్ కోర్టు జడ్జి రామచంద్రమూర్తి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాయి లక్ష్మణరావు, కార్యదర్శి సూరా శ్రీనివాస్, సభ్యులు కింతాడ ఈశ్వరరావు, సాయిరాం, శ్రీనివాసరావు, రామచంద్రరావు, సూకరాజు పాల్గొన్నారు.

జైలు సూపరింటెండెంట్‌గా కిశోర్‌కుమార్



కిశోర్‌కుమార్

ఆరిలోవ(విశాఖ తూర్పు): విశాఖ కేంద్ర కారాగారం సూపరింటెండెంట్‌గా ఎస్.కిశోర్‌కుమార్‌ను జైళ్ల శాఖ నియమించింది. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పని చేసిన ఎస్.రాహుల్‌ను రాజమండ్రి కేంద్ర కారాగారానికి అటాచ్‌మెంట్‌పై బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో నెల్లూరు జైలులో ఏపీఎస్‌టీఆర్ఎస్(జైల్ సిబ్బంది శిక్షణ కేంద్రం) ప్రిన్సిపాల్‌గా పని చేస్తున్న కిశోర్‌కుమార్‌ను నియమిసూత్ ఉత్తర్వులు జారీ చేసినట్టు విశాఖ జైలు అధికారులు తెలిపారు. కిశోర్‌కుమార్ ఒకటి, రెండు రోజుల్లో బాధ్యతలు స్వీకరించనున్నారు.

పేదింటి ఆడపిల్లకు పెళ్లి కానుక

- పేదలకు అండగా వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా
- రెండో విడత చెక్కు పంపిణీలో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



లబ్ధిదారులకు చెక్ అందిస్తున్న జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

సాక్షి, అనకాపల్లి : పేద కుటుంబాల్లో జన్మించిన మహిళలు వివాహ సమయంలో ఆర్థిక ఇబ్బందులకు లోనవకుండా వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకాలు అండగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి తెలిపారు. శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ కల్యాణమస్తు -షాదీ తోఫా' రెండవ విడత కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనకాపల్లి జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షించారు. అనంతరం అనకాపల్లి జిల్లాలో లబ్ధిదారులకు చెక్కు అందించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి మాట్లాడుతూ వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా రెండో విడత నిధులు విడుదల చేసినట్టు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగుల కుటుంబాల్లోని ఆడపిల్లలకు వైఎస్సార్ రెండో విడత ఆర్థికసాయం ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. తల్లిదండ్రులు అప్పులబారిన పడకుండా ఉండేందుకు దోహదపడుతుందన్నారు. బాల్య వివాహాలను నియంత్రించడంతో పాటు కనీస విద్య పదోతరగతిగా పేర్కొనడంతో విద్యావ్యాప్తి, మరోవైపు తల్లిదండ్రులకు ఆసరాగా నిలిచే అవకాశాలున్నాయన్నారు. ఈ పథకంలో భాగంగా దరఖాస్తు చేసుకునే వారు 10వ తరగతిలో ఉత్తీర్ణత సాధించాలన్నారు. బాలికలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు తప్పకుండా నిండి ఉండాలన్నారు. అర్హత ఉన్నప్పటికీ లబ్ధి చేకూరకపోతే జూన్ నెలలో లేదా డిసెంబర్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత సచివాలయంలో అధికారులకు తెలియజేయాలన్నారు. జిల్లా పరిషత్ వైస్ చైర్‌పర్సన్ బి.వరాహసత్యవతి, డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ అజయ్ బాబు, జీఎస్‌వీఎస్ ప్రత్యేక అధికారి మంజులవాణి, డీఎల్‌డీవో ఉదయశ్రీ లబ్ధిదారులు పాల్గొన్నారు.

జిల్లాలో వివరాలు

అనకాపల్లి జిల్లాలో వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీ తోఫా కింద రెండవ విడత 667 జంటలకు రూ.3 కోట్ల 86 లక్షల 70 వేల లబ్ధి చేకూరింది. మొదటి విడతతో కలిసి ఇప్పటివరకు 799 జంటలకు రూ.4 కోట్ల 77 లక్షల 5 వేలు అందించినట్టు అధికారులు వెల్లడించారు.

'కులాంతర' ప్రోత్సాహం పెంపు

కులాంతర వివాహాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక ప్రోత్సాహాన్ని గతంలో కంటే ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పెరిగింది. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.లక్ష, బీసీలకు రూ.50 వేలు అందిస్తోంది. కులాంతర వివాహాలు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు రూ.1.20 లక్షలు, బీసీలకు రూ.75 వేలు, దివ్యాంగులకు రూ.1.50 లక్షలు చొప్పున జమచేయనుంది. రిజిస్టర్డ్ భవన కార్మికులకు రూ.40 వేలు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం ఆడపిల్లల తల్లుల ఖాతాలకు, తల్లులులేని ఎడల ఆడపిల్లల ఖాతాలకు నగదును నేరుగా జమచేస్తోంది.

సిపాయి విషాదాంతం

- ఢిల్లీ రోడ్డు ప్రమాదంలో కన్నుమూత
- పెళ్లయి మూడు నెలలు కాకుండానే మృత్యువాత పడిన దిబ్బపాలెం యువకుడు



ఢిల్లీ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన మహేశ్



మహేశ్ (ఫైల్)

చీడికాడ: కుటుంబానికి అండగా ఉంటాడని కలలు కన్న తల్లి, భార్య ఆశలు ఆవిరైపోయాయి. ఆర్మీలో సిపాయిగా దేశానికి ఎంతో సేవ చేయాల్సిన యువకుడు అర్ధంతరంగా ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు. ఇండియన్ ఆర్మీలో పనిచేస్తున్న మధుమంతి మహేశ్ (25) రోడ్డు ప్రమాదంలో శుక్రవారం మృతి చెందారు. ఆయనది చీడికాడ మండలం దిబ్బపాలెం గ్రామం. గ్రామస్తులు, బంధువులు చెప్పిన వివరాలు.. మధుమంతి అచ్చిమినాయుడు, సింహాచలమ్మ దంపతుల ఏకైక కుమారుడు మహేశ్. ఆయన నాలుగు సంవత్సరాలుగా ఇండియన్ ఆర్మీలో సిపాయిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం రాజస్థాన్‌లోని సురత్‌ఘడ్ వద్ద పనిచేస్తున్న ఆయన విధి నిర్వహణలో భాగంగా ఆర్మీ వాహనం మీద శుక్రవారం ఉదయం ఢిల్లీ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో అక్కడ ట్రాఫిక్ క్లియర్ చెయ్యడానికి తాను ప్రయాణిస్తున్న వాహనం దిగారు. అదే సమయంలో బైక్ వేగంగా వచ్చి మహేశ్‌ను బలంగా ఢీకొట్టడంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యారు. వెంటనే సమీపంలో ఉన్న ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందారు. మహేశ్ తండ్రి అచ్చిమినాయుడు ఇదివరకే మృతి చెందారు. మహేశ్‌కు భార్య, తల్లి ఉన్నారు.

భార్య కాళ్ల పారాణి ఆరకుండానే..

మృతుడు మహేశ్‌కు ఈ ఏడాది ఫిబ్రవరి 22న మాకవరపాలెం మండలానికి చెందిన ఉమతో వివాహం అయింది. మూడు మాసాలు కూడా పూర్తి కాలేదు. ఇంతలోనే రోడ్డు ప్రమాదం వారిని దూరం చేసింది. విషయం తెలిసిన వెంటనే మృతుడి భార్య ఉమ, తల్లి సింహాచలమ్మ, బంధువులు కన్నీరు మున్నీరయ్యారు. దిబ్బపాలెం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మహేశ్ కుటుంబ సభ్యులను దండిసురవరం పీఏసీఎస్ అధ్యక్షుడు నందారపు రమణబాబు, మాజీ ఎంపీపీ దారపు సత్యనారాయణ, తదితర్లు ఓదార్చారు. మహేశ్ మృతదేహం శనివారం సాయంత్రానికి ఢిల్లీ నుంచి రావచ్చని తెలిసింది.

ప్రతిస్పందన

'ఇన్నాళ్లూ ఒక లెక్క.. ఇప్పుడొక లెక్క' అన్నట్టుంది జిల్లా అధికారుల స్పందన. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో ఇచ్చే అర్జీలపై సమీక్షకు సిద్ధమయ్యారు. జగనన్నకు చెబుదాం పేరిట ఇప్పటికే స్పందన అర్జీలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ, సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నారు. ఇపుడు ప్రతి శుక్రవారం 'ఒకే వేదికపై స్పందన సమస్యల పరిష్కారం' పేరిట వర్చువల్ విధానంలో జిల్లా వ్యాప్తంగా అర్జీదారులతో మాట్లాడి, వారి సమస్యల్ని పరిష్కరించే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

- ప్రతి శుక్రవారం స్పందన అర్జీలపై ప్రత్యేక సమీక్ష
- 'ఒకే వేదికపై స్పందన సమస్యల పరిష్కారం' పేరిట శ్రీకారం
- జిల్లా వ్యాప్తంగా వర్చువల్ సమీక్ష నిర్వహించిన కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



సమీక్షిస్తున్న జేసీ జాహ్నవి, అడిషనల్ ఎస్పీ విజయ భాస్కర్, సచివాలయ ప్రత్యేక అధికారి మంజులావాణి

సాక్షి, అనకాపల్లి : 'స్పందన సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండకూడదు. స్పందనలో విన్నవించుకున్న ప్రతీ సమస్యను పరిష్కరించి, ప్రజలకు మరింత చేరువ కావాలి'.. ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రవిపట్టాన్ శెట్టి సంబంధిత అధికారులకిచ్చే ఆదేశాలివి. శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 'ఒకే వేదికపై స్పందన సమస్యల పరిష్కారం' కార్యక్రమం ద్వారా నేరుగా ఫిర్యాదుదారులతో ఉన్నతాధికారులే మాట్లాడి, వారి సమస్యల్ని పరిష్కరించే నూతన కార్యక్రమానికి కలెక్టర్ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్పందన, రీ సర్వే, మ్యుటేషన్లు భూసేకరణ, యూఎల్‌సీ భూములు తదితర రెవెన్యూ అంశాలపై ఆర్డీవోలు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్పందన అర్జీలు రీ ఓపెన్ కాకుండా పరిష్కరించి, అర్జీల సంఖ్య పూర్తిగా తగ్గేలా పనిచేయాలని అధికారులను సూచించారు. జిల్లాలో ప్రజలకు సంబంధించి పెండింగ్ సమస్యల్లో భూములకు సంబంధించినవి అధికంగా ఉన్నాయని, స్పందన ద్వారా వచ్చే ప్రతి అర్జీను తహసీల్దార్లు, సర్వేయర్లు, వార్డు సచివాలయ సిబ్బంది క్షుణ్ణంగా పరిశీలించి, తప్పిదాలకు తావులేకుండా పూర్తిస్థాయిలో పరిష్కరించాలని ఆదేశించారు. స్పందన అర్జీల పట్ల అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేసి, ప్రజల సమస్యలను అత్యంత శ్రద్ధతో పరిష్కరించి, జిల్లాను ముందు వరసలో నిలపాలని కోరారు. ప్రతి శుక్రవారం ఉదయం 11 గంటలకు 'స్పందన' పెండింగ్ సమస్యలపై జిల్లా ఎస్పీ, జాయింట్ కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి ఒకే వేదికపై సంబంధిత అధికారులతో సమీక్షించి పూర్తి స్థాయిలో, వేగంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఒకే వేదికపై రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీలు, మండల స్థాయిలో ఎమ్మార్వో, ఎంపీడీవోలు, ఎస్‌హెచ్‌వో, మండల సర్వేయర్లు ఆ వారంలో విన్నవించుకున్న అర్జీల పరిష్కారంపై సమీక్షించాలని ఆదేశించారు. జిల్లా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు మండల స్థాయి అధికారులతో స్పందన సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చించి, సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రతీ దరఖాస్తుదారుడి సమస్యను మరింత గుణాత్మకంగా పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 137 మంది స్పందన అర్జీదారులు ఆయా మండల, రెవెన్యూ డివిజన్ పరిధిలో పాల్గొన్నారు. అధికారుల పనితీరుపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు.

ఆనందమానందమాయె..

- సీఎం జగన్ చిత్రపటానికి 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల క్షీరాభిషేకం
- పాదయాత్రలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారని ప్రశంసల జల్లు
- ఉత్తరాంధ్ర పరిధిలో ఏర్పాటైన టీచర్స్ అసోసియేషన్లు



మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర జిల్లాల ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు రమణమూర్తి

అనకాపల్లి టౌన్: ఎప్పుడో పాతికేళ్ల క్రితం ఉపాధ్యాయులుగా స్థిరపడాల్సినవారు.. కాలం కలిసిరాక నిరుద్యోగులుగా మిగిలిపోయారు.. ఏదో ఒక వృత్తిలో కుదురుకొని డీఎస్సీకి ఎంపికైన విషయం కూడా మరిచిపోయారు.. పాదయాత్రలో ఇచ్చిన హామీని నిలబెట్టుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఇప్పుడు ఉద్యోగాలు ఇవ్వడంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ కృతజ్ఞత తెలుపుకున్నారు. అనకాపల్లి జిల్లా సీఐటీయూ కార్యాలయంలో 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశం శుక్రవారం జరిగింది. ఉత్తరాంధ్ర జిల్లాల ఎంటీఎస్ టీచర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పి.వి.రమణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకున్నారంటూ ప్రశంసల జల్లు కురిపించారు. విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 1998 డీఎస్సీ ఉద్యోగులంతా హాజరై సంబరాలు చేసుకున్నారు. స్వీట్లు పంచుకున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 4072 మందిని గురువుల స్థానంలో నిలబెట్టిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని, ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటామని చెప్పారు.

మేలు మరచిపోలేం..



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. 1998 డీఎస్సీ రాసి చాలచాలనీ జీతాలకు ప్రైవేటు పాఠశాలల్లో పనిచేశాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మా తలరాత మారిపోయింది. ఎంటీఎస్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నానంటే అది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెట్టిన భిక్షే.

– లాలం గణేశ్వరరావు, నర్సీపట్నం

ఇటువంటి సీఎంను ఎప్పుడూ చూడలేదు



ఇటువంటి సీఎంను నేనెప్పుడూ చూడలేదు. 1998లో డీఎస్సీ పాసై ఎన్నో ఏళ్ల నుంచి ఎదురు చూసిన కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వచ్చి నిజం చేశారు. ఆయన నిరుద్యోగుల పక్షపాతి. వారికి మేలు చేయాలని కోరుకునేవారు. ఆయన వల్లే మా ఆశ ఫలించింది.

– సూర్యకళ, దుంబ్రిగుడ

రుణపడి ఉంటాం..



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చొరవతోనే మాకు ఎంటీఎస్ ఉద్యోగాలు వచ్చాయి. 25 ఏళ్ల సుదీర్ఘపోరాటం తర్వాత మాకు ఉపాధ్యాయ ఉద్యోగం రావడం ఆనందంగా ఉంది. మా కుటుంబంలో వెలుగులు నింపిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటా.

–పి.అప్పలరాజు, భీమిలి

క్లుప్తంగా

పెద్దేరుకు పెరుగుతున్న వరద నీరు

మాడుగుల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు మండలంలోని పెద్దేరు జలాశయం లోకి 17 క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుందని జేఈ సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. జలాశయం కేచ్‌మెంట్ ఏరియాలో 26 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైందన్నారు. జలాశయం గరిష్ట నీటిమట్టం 137 మీటర్లు, ప్రస్తుతం 131.60 మీటర్లకు చేరిందన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

నర్సీపట్నం: బలిఘట్టం మరిడిమాంబ జాతర సందర్భంగా తలెత్తిన ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు చేశామని పట్టణ సీఐ ఎన్.గణేష్ తెలిపారు. కులం పేరుతో దూషించి విచక్షణ రహితంగా కొట్టారని బలిఘట్టం ఎస్సీ కాలనీకి చెందిన దనియా మహేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సుర్ల నాయుడుతోపాటు మరో ఆరుగురుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశామన్నారు. జాతర నుంచి ఇంటికి వెళ్తుండగా దనియా మహేష్, జయకృష్ణ బైక్‌పై వేగంగా వచ్చి తన ముందు సడన్ బ్రేక్ వేయడంతో నెమ్మదిగా వెళ్లాలని చెప్పినందుకు తనను కొట్టారని అదే గ్రామానికి చెందిన శెట్టి దేముడునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వారిద్దరుతోపాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వ్యాన్ ఢీ కొని వృద్ధుడి మృతి




వెంకటేశ్వర్లు

పాయకరావుపేట: పట్టణంలోని కరణం గారి వీధికి చెందిన ములుకూరు వెంకటేశ్వర్లు (74) వ్యాన్ ఢీ కొట్టడంతో మృతి చెందినట్లు ఏఎస్ఐ గోవిందు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని మంగవరం జంక్షన్ వద్ద గురువారం అతడు రోడ్డు దాటుతుండగా వ్యాన్ ఢీ కొట్టడంతో కాళ్లకు బలమైన గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం తుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడన్నారు. మృతుడు కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

427 ఎకరాలతో ఉత్తరాంధ్ర టూరిస్ట్ హబ్

- హబ్ పరిధిలో 427 ఎకరాలున్నట్లు గుర్తించిన పర్యాటక శాఖ
- రెవెన్యూ శాఖ పరిధిలో వందల ఎకరాల బదలాయింపు పెండింగ్
- పెండింగ్ భూముల వివరాల నివేదిక సిద్ధం చేసిన పర్యాటక శాఖ
- త్వరలోనే బదలాయింపు ప్రక్రియ
- డీపీఆర్‌ల ప్రకారం ఎంవోయూ సంస్థలకు భూ కేటాయింపులపై ప్రణాళికలు





సాక్షి, విశాఖపట్నం : సహజ అందాలతో అలరారే ఉత్తరాంధ్ర పర్యాటకాన్ని కొత్త పుంతలు తొక్కేందుకు సరికొత్త ఆలోచనలతో రాష్ట్ర ప్రభుత్వం ముందుకెళ్తోంది. ఒకవైపు సాగర సోయగాలు.. మరోవైపు ఎత్తయిన తూర్పు కనుమల అందాలు ప్రపంచ పర్యాటకులను కట్టిపడేస్తుండగా.. ప్రపంచ పర్యాటక పటంలో టూరిజం రాజధానిగా భాసిల్లే విధంగా ప్రాజెక్టులకు ఇటీవల విశాఖ వేదికగా నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో కీలక ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇందుకు అవసరమైన భూములను ఆయా ప్రాజెక్టులకు అప్పగించేందుకు టూరిజం శాఖ కసరత్తు ప్రారంభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ఉన్న పర్యాటక భూముల పరిధిని విశాఖ హబ్‌గా ఏర్పాటు చేస్తూ.. ఆయా ప్రాజెక్టుల డీపీఆర్‌లకు అనుగుణంగా భూ కేటాయింపులు చేసేందుకు ప్రణాళికలు అమలు చేస్తున్నారు.

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా జిల్లాలో ఉన్న అపార అవకాశాలను మెరుగు పరుచుకొని పర్యాటక ప్రాంతాల అభివృద్ధి పనులకు రూపకల్పన జరుగుతోంది. విశాఖ జిల్లానూ పర్యాటక ఖిల్లాగా మార్చే దిశగా.. టూరిజం ప్రాజెక్టులకు కసరత్తు చేస్తున్నారు. మార్చి 3, 4 తేదీల్లో విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో జరిగిన పర్యాటక ఒప్పందాల్లో సింహభాగం ఇన్వెస్టర్లు విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలను ఎంపిక చేసుకున్నారు. ఉమ్మడి విశాఖతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పర్యాటక అవకాశాలు పుష్కలంగా ఉన్న ప్రతి ప్రాంతంలోనూ ప్రాజెక్టులు ఏర్పాటు చేసేందుకు వివిధ సంస్థలు ముందుకొచ్చాయి. జీఐఎస్‌లో పర్యాటక రంగానికి సంబంధించి రూ.8,806 కోట్లతో 64 ప్రాజెక్టులు ఉత్తరాంధ్రకు రానున్నాయి.

విశాఖ హబ్‌లో పర్యాటక భూముల వివరాలివీ...

విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో	296.15 ఎకరాలు
శ్రీకాకుళం జిల్లాలో	32.78 ఎకరాలు
విజయనగరం జిల్లాలో	48.8 ఎకరాలు
పార్వతీపురం మన్యం జిల్లాలో	6.25 ఎకరాలు
అల్లూరి సీతారామరాజు జిల్లాలో	43.1 ఎకరాలు
మొత్తం విశాఖ హబ్ పరిధిలో	427.08 ఎకరాలు

భూ బదలాయింపు ప్రక్రియ షురూ

విశాఖ హబ్ పరిధిలో 39 పార్శిళ్లలో 427.08 ఎకరాలున్నట్లుగా గుర్తించారు. ఇందులో ఎక్కువ మొత్తం భూములు ఇంకా బదలాయింపునకు నోచుకోలేదు. ఈ ప్రక్రియను టూరిజం శాఖ ప్రారంభించింది. ఆయా జిల్లాల కలెక్టర్లకు రెవెన్యూ పరిధిలో ఉన్న పర్యాటక భూముల బదలాయింపు వేగవంతం చేయాలని టూరిజం అధికారులు లేఖలు రాశారు. ప్రస్తుతం వీటికి సంబంధించిన ఫైల్స్ ఆయా మండల తహశీల్దారుల పరిధిలో ఉన్నాయి. వీటిని త్వరగా క్లియర్ చేయాలంటూ కలెక్టర్లు ఆదేశాలు జారీ చేయనున్నారు. భూ బదలాయింపు ప్రక్రియ పూర్తయ్యేలోపు.. ఎంవోయూలు చేసుకున్న పెట్టుబడిదారుల నుంచి కూడా ఫైల్స్ కదిలేలా చేస్తున్నారు. ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌తో పాటు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ యూనిట్(పీఎంయూ) కూడా అందించాలంటూ ఎంవోయూలు చేసుకున్న సంస్థలకు పర్యాటక శాఖ ఉన్నతాధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ డీపీఆర్, పీఎంయూలు అందితే.. మరోవైపు బదలాయింపు ప్రక్రియ పూర్తయితే.. ఏ ప్రాజెక్టుకు ఏ ల్యాండ్ అవసరమవుతుందనే దానిపై నిర్ణయించి.. ఆయా సంస్థలకు కేటాయింపులు చేపట్టే ప్రక్రియను ప్రారంభించనున్నారు.

సరిహద్దుల గుర్తింపునకు రోవర్ సర్వే

మరోవైపు.. భూముల బదలాయింపు పూర్తయిన తర్వాత.. పర్యాటక భూముల సరిహద్దులను గుర్తించేందుకు సర్వే నిర్వహించనున్నారు. దీనిపై కలెక్టర్ డా.మల్లికార్జున ఆదేశాల మేరకు విశాఖపట్నం, భీమిలి ఆర్డీవోతో టూరిజం రీజినల్ డైరెక్టర్ శ్రీనివాస్ పాణి భేటీ అయ్యారు. డ్రోన్ సర్వేకు అనుమతులు లేని కారణంగా రోవర్స్ సర్వే నిర్వహించి హద్దులు గుర్తించనున్నారు. ప్రస్తుతం రోవర్స్ విజయనగరం జిల్లాలో భూహక్కు రీ సర్వేలో ఉన్న కారణంగా వారం రోజుల్లో సర్వే ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

విభిన్న ప్రతిభావంతులకు రుణాలు



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

- సద్వినియోగం చేసుకోవాలన్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం మంజూరు చేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్య శాఖ, విభిన్న ప్రతిభా వంతుల విభాగం అధికారులతో వేర్వేరుగా నిర్వహించిన సమీక్షలో ఆయనతోపాటు జేసీ ఎం.జాహ్నవి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అనుభవమున్న రంగంలో వ్యాపార పెట్టుబడిగా రుణాలను పొంది అభివృద్ధి చెందాలన్నారు. అతి తక్కువ వడ్డీకే ఇస్తున్న రుణాలతో నూతన వ్యాపారం, వ్యాపార విస్తరణ చేసుకోవచ్చన్నారు. జిల్లాలో మాతృ మరణాలు సంభవించకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రసవ సమయంలో మాతృ మరణాలపై ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై సమీక్షించాలన్నారు. క్షేత్రస్థాయిలో ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలకు తగిన సూచనలు చేయాలన్నారు. భౌగోళికంగా ఏ ప్రాంతంలో గర్భిణులు ఎక్కువ ఇబ్బందులకు గురవుతున్నారో గుర్తించాలన్నారు. రక్తహీనత, గర్భస్థ సమస్యలపై స్త్రీలకు క్షుణ్ణమైన అవగాహన కల్పించాలన్నారు. విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయ సంచాలకుడు జి.వి.బి. జగదీస్ మాట్లాడుతూ ఎన్ఎఫ్‌డీసీ ద్వారా జిల్లాలో రూ.కోటి కేటాయించారని, 21 మంది విభిన్న ప్రతిభావంతులకు రూ.59 లక్షలు మంజూరు చేశామని పేర్కొన్నారు. జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ భీశెట్టి సత్యవతి, డీఎంహెచ్‌వో హేమంత్, సీహెచ్ఎస్ శ్రావణ్‌కుమార్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ ఉషారాణి పాల్గొన్నారు.

గుర్రపు పందేల విజేతగా రామన్నపాలెం

యలమంచిలి: మండలంలోని పీఎస్ఆర్‌పేట, పేట బయ్యవరం గ్రామాల్లో శుక్రవారం రాష్ట్ర స్థాయి గుర్రపు పందేలు ఉత్సాహంగా జరిగాయి. ఇక్కడ దుర్గాదేవి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో వివిధ ప్రాంతాల నుంచి 12 గుర్రాలు పాల్గొన్నాయి. అచ్యుతాపురం మండలం రామన్నపాలెం గ్రామానికి చెందిన ధర్మిరెడ్డి అప్పారావు గుర్రం విజేతగా నిలిచింది. ఈ గుర్రానికి ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో దేవరాపల్లికి చెందిన నవీన్ చెర్రీ గుర్రం రూ.20 వేలు, రూ.15 వేలు దక్కించుకున్నాయి. చోడవరం మండలం గవరవరం గ్రామానికి చెందిన ఠాగూర్ గుర్రం నాల్గో స్థానంలో నిలిచి రూ. 10 వేలు, ఎల్.కోటకు చెందిన సింగపూర్ సత్యనారాయణకు చెందిన గుర్రం ఐదో స్థానంలో నిలిచి రూ.5 వేలు గెలుపొందాయి. సర్పంచ్‌లు గొన్నాబత్తుల శివ, మొగలపల్లి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు మొగ్గ గోవిందరావు, ఊటకూటి శేఖర్ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆస్పత్రిపై దుష్ప్రచారం సిగ్గుచేటు

- ఎంపీ సత్యవతి తనయుడు డాక్టర్ యశ్వంత్



ఆక్సిజన్ ప్లాంట్ వద్ద సెల్ఫీ దిగుతూ మాట్లాడుతున్న డాక్టర్ యశ్వంత్

అనకాపల్లి టౌన్: రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్టీఆర్ వైద్యాలయంపై దుష్ప్రచారం చేయడం మానుకోవాలని మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణకు ఎంపీ సత్యవతి తనయుడు డాక్టర్ యశ్వంత్ హితువు పలికారు. వైద్యాలయ ఆవరణలో ఆక్సిజన్ ప్లాంట్ ముందు శుక్రవారం తను సెల్ఫీ దిగి మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్యసేవల కోసం ఎంపీ నిధుల ద్వారా అత్యాధునిక అంబులెన్స్ అందిస్తే, నిధులు దుర్వినియోగం అయ్యాయంటూ పీలా గోవింద్ అర్థం లేకుండా మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ మెప్పు కోసం, ఎమ్మెల్యే సీటు రాదని బెంగతో ఇలాంటి పిచ్చి చేష్టలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. వైద్యాలయ రోగులకు అంబులెన్స్ వినియోగం, రోగుల వివరాలతో సహా, ఆధారాలను నిరూపించడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు సవాల్ విసిరారు. కరోనా తొలి, మలి విడతలో కనిపించని పీలా ఇప్పుడు అసత్య ఆరోపణలు చేయడం తగదని హెచ్చరించారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి అభ్యర్థన మేరకు పలు కంపెనీలు రెండు ఆక్సిజన్ ప్లాంట్లను డా ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

అర్ధరాత్రి జీపు బోల్తా

- ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు
- సిరశపల్లి సమీపంలో ఘటన



దిలీప్‌కుమార్ మృతదేహం

పెదబయలు: మండలంలోని గలగండ గ్రామ సమీపంలో పాడేరు నుంచి ఒడిశా వెళ్తున్న జీపు బోల్తా పడింది. గురువారం అర్ధరాత్రి చోటు చేసుకున్న ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... జి.మాడుగుల మండలం సింగర్బ పంచాయతీ నిట్టపుట్టు గ్రామానికి చెందిన సుమారు పది మందితో ఈ నెల 4న రాత్రి 11.30 గంటలకు ఒడిశాలోని గొల్లోరి గ్రామంలో తమ బంధువుల గృహ ప్రవేశానికి బయలు దేరారు. ఈ క్రమంలో పెదబయలు మండలం గలగండ పంచాయతీ సిరశపల్లి గ్రామ సమీపంలో రోడ్డుకు అడ్డంగా పశువులు వచ్చాయి. వాటిని తప్పించే క్రమంలో బ్రేక్ వేయడంతో రోడ్డు పక్కన జీపు బోల్తా పడింది. నిట్టాపుట్టు గ్రామానికి చెందిన పరదాని దిలీప్‌కుమార్(25) జీపు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. జీపులో ఉన్న మాడేం భూలోకమ్మకు కాలు, చేయి విరిగింది. మిగిలిన 9 మంది ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. వీరిని 108 వాహనంలో పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అయితే రాత్రి సమయంలోనూ స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సకాలంలో తరలించి వైద్య సేవలందించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించామని, కేసు నమోదు చేశామని ఎస్ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు.

కార్పస్ ఫండ్‌తో మంచినీటి పథకాల నిర్వహణ

- టాటా ట్రస్టు డైరెక్టర్ వాఘేలా



సచివాలయ సిబ్బంది, గ్రామస్తులతో టాటా ట్రస్టు డైరెక్టర్

చోడవరం రూరల్: స్వయంగా కార్పస్ ఫండ్‌ను రూపొందించుకోవడం ద్వారా ముప్పై ఏళ్లపాటు ఇంటింటికీ కుళాయి నీటిని నిర్వహించుకోవాలని జలజీవన్ మిషన్ టాటా ట్రస్టు డైరెక్టర్ దివ్యాంగ్ వాఘేలా సూచించారు. జలజీవన్ మిషన్‌లో భాగంగా మండలంలోని సీమునాపల్లి, ఖండేపల్లి, మైచర్లపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన మంచినీటి పథకాలను టాటా ట్రస్టు బృందం సందర్శించింది. ఆయా గ్రామాల్లో జలజీవన్ మిషన్ పథకాలను పరిశీలించింది. వాటి నిర్వహణ తీరును అడిగి తెలుసుకుంది. ప్రతీ ఇంటికి చాలినంత మంచినీరు లభ్యమవుతుందా లేదా అని గ్రామస్తులను ఆరా తీసింది. ఈ మేరకు ఆయా గ్రామాల్లో పనులను పర్యవేక్షించింది. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి టాటా ట్రస్టు డైరెక్టర్ మాట్లాడారు. ఐదుగురు మహిళలతో కమిటీ ఏర్పడి గ్రామంలో వీడబ్ల్యూసీ ఖాతాను తెరచి ప్రతీ ఇంటి నుంచి వాటా ధనాన్ని సేకరించి అకౌంట్‌కు జమ చేయాలన్నారు. ఈ సొమ్ము రేపటి రోజున పథకం నిర్వహణ ఖర్చులకు ఉపకరిస్తుందని సూచించారు. బెన్నవోలులో ఎస్పీల్డ్ రేషన్ ట్యాంకు నిర్మాణాన్ని పరిశీలించారు. సర్పంచ్ మూడెడ్ల శంకరరావు, కార్యదర్శులు, గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం వెళ్లి పింఛన్ అందజేత



రాజమహేంద్రవరంలో నూకమ్మకు పింఛన్ నగదు అందిస్తున్న వలంటీర్ రాజ్యలక్ష్మి



విశాఖలోని ఓ ఆస్పత్రిలో రాములమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు

బుచ్చెయ్యపేట: మండలంలోని మంగళాపురం గ్రామ వలంటీర్ రాజ్యలక్ష్మి రాజమహేంద్రవరం వెళ్లి పింఛన్ సొమ్ము అందించింది. గ్రామానికి చెందిన గొర్లి నూకమ్మ వృద్ధాప్యంతో ఇటీవల అనారోగ్యానికి గురైంది. అక్కడ ఉపాధి కోసం వెళ్లిన కుమారుడి ఇంట్లో ఉంటూ వైద్య సేవలు పొందుతోంది. ఆమె ఆర్థిక ఇబ్బందులు తెలుసుకున్న వలంటీర్ తన సొంత ఖర్చులతో శుక్రవారం అక్కడకెళ్లి పింఛన్ అందించింది.

విశాఖ వెళ్లి...

చీడికాడ: మండలంలో చీడిపల్లి పంచాయతీ శివారు నీలంపేటకు చెందిన మతల రాములమ్మకు శుక్రవారం గ్రామ వలంటీరు రొంగలి అచ్చియ్యమ్మ పింఛను అందజేసింది. విశాఖలోని ఓ ఆస్పత్రిలో కాలికి శస్త్రచికిత్స చేయించుకున్న రాములమ్మ కృతజ్ఞతలు తెలిపింది.

ఎస్ఈబీకి చిక్కిన గంజాయి ముఠా

- డబ్బుకు ఆశపడి గంజాయి రవాణా
- పట్టుబడిన వారిలో ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలు
- 18 కేజీల గంజాయి, ఐదు మొబైళ్లు స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): కమీషన్‌కు ఆశపడి హోల్‌సేల్ వ్యాపారి నుంచి కొనుగోలుదారులకు గంజాయిని చేరుస్తున్న ఓ ముఠా గుట్టును ఎస్ఈబీ అధికారులు రట్టు చేశారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర మెమోరియల్ కాన్ఫరెన్స్ హాల్లో శుక్రవారం ఏఎస్పీ, ఎస్ఈబీ క్రైమ్ ఇన్‌చార్జి డి.హిమవతి వివరాలను వెల్లడించారు. మాదకద్రవ్య రహిత జిల్లానే లక్ష్యంగా ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి చర్యలు చేపట్టారు. ఏఎస్పీ పర్యవేక్షణలో ఎస్ఈబీ, పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లా వ్యాప్తంగా దాడులు ముమ్మరం చేశారు. శుక్రవారం తెల్లవారుజామున ఎస్ఈబీ పోలీస్ టీం ఇన్‌స్పెక్టర్ హెచ్ఎస్ హుస్సేన్‌బాషా, కావలి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు తమ సిబ్బందితో కలిసి తనిఖీలు ముమ్మరం చేశారు. కావలి ఆర్టీసీ బస్టాండ్ వద్ద గంజాయిని తరలిస్తున్న తమిళనాడు రాష్ట్రం సేలం జిల్లా కుల్లంపట్టి ప్రాంతానికి చెందిన రమేష్‌రాజు, కాకినాడ జిల్లా శంఖవరం మండలం కొత్తంగి గ్రామానికి చెందిన ఆర్.గణేష్, విశాఖ జిల్లా రోలుగుంట మండలానికి చెందిన కె.సాయి, కాకినాడ జిల్లా శంఖవరం మండలానికి చెందిన ఎం.అనంత, పత్తిపాడు మండలం దారాపల్లి గ్రామానికి చెందిన ఎస్.లోవాకుమారిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 18 కేజీల గంజాయిని, ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారించి కమీషన్ పద్ధతిపై సేలం, కేరళ రాష్ట్రంలోని వారికి గంజాయి చేరుస్తున్నామని గుర్తించారు.

కమిషన్ తీసుకుంటూ..

రమేష్‌రాజు లారీ డ్రైవర్. ఆరునెలల క్రితం యాక్సిడెంట్ కావడంతో కాళ్లకు శస్త్రచికిత్స చేశారు. దీంతో డ్రైవింగ్ చేయడం కష్టతరంగా మారింది. అతని యజమాని గంజాయి విక్రయదారుడు. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగరాజుమడుగు (జి.మాడుగుల) ప్రాంతానికి చెందిన సరఫరదారుని వద్ద గంజాయి కొనుగోలుచేసి సేలంతోపాటు సమీప ప్రాంతాల్లో విక్రయించి సొమ్ము చేసుకోసాగాడు. రమేష్‌రాజు పరిస్థితిని చూసిన ఆయన జి.మాడుగల నుంచి గంజాయి తనకు తెచ్చి ఇచ్చిన ప్రతిసారి రూ.10 వేలు కమీషన్ ఇస్తానని ఆశ చూపాడు. దీంతో రమేష్‌రాజు కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా గంజాయిని తెచ్చి ఇస్తున్నాడు.

- ఆర్.గణేష్, కె.సాయి, ఎం.అనంత, ఎస్.లోవాకుమారి రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేసేవారు. సంపాదన సరిపోవడంలేదని జి.మాడుగులకు చెందిన గంజాయి సరఫరాదారుడితో పరిచయం పెంచుకున్నారు. ఆయన కేరళలో తాను చెప్పిన వ్యక్తులకు గంజాయి ఇచ్చిన ప్రతిసారి రూ.10 వేలు కమీషన్ ఇస్తానని ఆశ చూపాడు. వారు కొంతకాలంగా జి.మాడుగుల నుంచి కేరళకు గంజాయిని తీసుకెళ్లి అక్కడ విక్రయదారులకు ఇస్తున్నారని విచారణలో బయటపడింది. ఐదుగురితోపాటు జి.మాడుగులకు చెందిన గంజాయి హోల్ సేల్ సరఫరాదారుడు, అతని బావమరిదిపై సైతం ఎస్ఈబీ అధికారులు కేసు నమోదు చేశారు. సమావేశంలో ఎస్ఈబీ ఈఎస్ ఎస్.రవికుమార్, ఏఈఎస్ కృష్ణకిశోర్‌రెడ్డి, పోలీస్ టీం ఎస్సై బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'వృద్ధుల సమస్యలు పరిష్కరించాలి '


సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

అనకాపల్లిటౌన్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వయోవృద్ధుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు అన్నారు. సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైలు, బస్సు ప్రయాణాల్లో వృద్ధులకు రాయితీ కల్పించాలని కోరారు. వృద్ధులకు పింఛన్ పెంచేందుకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, వృద్ధులు పాల్గొన్నారు.

ఘనంగా దేవతమ్మ పుట్టుక మహోత్సవం


గవరపేటలో దేవతమ్మ పుట్టుక ఊరేగింపు

కశింకోట : స్థానిక గవరపేట దేవతమ్మ పుట్టుక మహోత్సవం గురువారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా గ్రామస్తులు ఆలయం నుంచి శారదానది అవతల పొలాల్లో ఉన్న అమ్మవారి పుట్ట వద్దకు జముకుల డప్పులు, బాణసంచాతో ఊరేగింపుగా వెళ్లారు. ప్రధానంగా వేగి ఇంటి పేరున్న వారు పట్ట వద్ద పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ప్రతిరూపాన్ని సంప్రదాయంగా బుట్టలో ఊరేగింపుగా తీసుకు వచ్చి ఆలయంలో నిలిపారు. శుక్రవారం అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

అనకాపల్లిటౌన్ : పట్టణంలో 83వ వార్డు పరిధిలో నాగవంశంవీధి, మల్లిమణుగులవారి వీధి, కాశీవిశ్వేశ్వర ఆలయం వీధుల్లో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చొరవతో ఏపీఈపీడీసీఎల్ అధికారులు శుక్రవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. రూ.8 లక్షల వ్యయంతో 40 కేవీ స్థానంలో 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ను ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. లో ఓల్టేజ్ సమస్యలకు పరిష్కారం చూపినందుకు సహకరించిన కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 472 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	4,500	4,590
మొదటి రకం	4,500	4,860
రెండో రకం	3,880	3,920
మూడో రకం	2,800	3,850

అనకాపల్లి సినిమాలు

అరంగేట్రం	రాజా
రామబాణం	సత్యనారాయణ స్క్రీన్-1
గార్డియన్స్ ఆఫ్ ది గెలాక్సీ (తెలుగు 3డి)	సత్యనారాయణ స్క్రీన్-2
పీఎస్-2	షిర్డీసాయి
విరూపాక్ష	పర్తిసాయి
రుద్రుడు	వెంకటేశ్వర
ఉగ్రం	శ్రీసత్య
ఏజెంట్	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 49 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9 యూనిట్లు, బీ పాజిటివ్-10 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-27 యూనిట్లు , ఏబీ పాజిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 364 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

రసాయనం.. నేల నిస్సారం

- పురుగు మందుల అధిక వినియోగంతో కీడు
- మోతాదుకు మించితే హానికరమంటున్న శాస్త్రవేత్తలు


వరి చేనులో పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు

అనకాపల్లి రూరల్ : అధిక దిగుబడులు సాధించాలన్న తపనతో అన్నదాతలు ఎడాపెడా రసాయన ఎరువులను వినియోగిస్తున్నారు. పంట ఉత్పత్తులపై పురుగు మందులను పిచికారీ చేస్తున్నారు. ఇది మోతాదుకు మించడంతో తిండి గింజలు విషతుల్యంగా మారుతున్నాయి. పంటలపై అధికంగా రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగంతో మనుషులు, పశువుల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని వ్యవసాయ శాస్త్రవేత్తలు, వైద్యులు హెచ్చరిస్తున్నారు.

సారం కోల్పోతోన్న నేల

బస్తాలకు బస్తాలు ఎరువులు, డబ్బాల కొద్దీ పురుగు మందులతో తెగుళ్లు నశించడంలేదు.. సరికదా కొత్త తెగుళ్లు పుట్టుకొస్తున్నాయి. నేల స్వభావానికి అనువుగా ఎరువులు, పురుగు మందులు వాడాలన్న అవగాహన లేకపోవడంతో ఈ దుస్థితి నెలకొంది. ఇక భూసార పరీక్షలను రైతులు నిర్లక్ష్యం చేయడంతో పాటు రైతులు సొంత అనుభవాలతో రసాయన ఎరువుల వాడకాన్ని మోతాదుకు మించి వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడుల భారం పెరిగడంతో పాటు నేల సారం కోల్పోతోంది.

రసాయనాలతో దీర్ఘకాలిక రోగాలు

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో కశింకోట, మునగపాక, పరవాడ, సబ్బవరం, అనకాపల్లి మండలాల్లో ఏటా ఖరీఫ్ సీజన్‌లో భారీ సాగు జరుగుతోంది. దాదాపు 45 వేల మంది రైతులు సుమారు 11 వేల హెక్టార్లలో పంటలు వేస్తున్నారు. అవి దెబ్బతినకుండా ఉండేందుకు, అధిక దిగుబడి పొందేందుకు యూరియా, డీఏపీ, ఎంవోపీ, ఎన్పీకే ఎస్, ఎస్ఎస్‌పీలను వాడుతున్నారు. ఇవన్నీ నేలల స్వభావాన్ని బట్టి వాడాలి. రైతులు మాత్రం సొంత నిర్ణయాలు, దుకాణదారుల సూచనలతో ఎడాపెడా వాడేస్తున్నారు. దీంతో పెట్టుబడి వ్యయం రెట్టింపవుతోంది. నేల నిస్సారమై దిగుబడులు క్షీణిస్తున్నాయి. అధిక మోతాదు ఎరువులు, రసాయనాలు వినియోగించే పంట ఉత్పత్తుల వల్ల ప్రజలు దీర్ఘకాలిక రోగాలబారిన పడుతున్నట్టు వైద్యులు చెప్తున్నారు.

భూసార పరీక్షలతో కట్టడి

వ్యవసాయ అధికారులు భూసార పరీక్షలు చేసి, ఫలితాల ఆధారంగా ఎరువులు, పురుగు మందులు వాడేలా రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువులు, పురుగు మందుల వినియోగానికి ఖచ్చితమైన సలహాలు అందించేలా ప్రణాళిక రూపొందించింది. దీనిలో భాగంగా అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో అధికారులు భూసార పరీక్షలకు లక్ష్యాన్ని నిర్దేశించుకుని మట్టి నమూనాలను ప్రయోగశాలలకు పంపిస్తున్నారు. ప్రస్తుతం పలు ప్రాంతాల్లో భూసార పరీక్షలు చేపట్టే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు, సూక్ష్మ పోషకాలను వినియోగిస్తే పంటకు మేలు చేకూరడంతో పాటు పెట్టుబడి తగ్గుతుంది. మరోవైపు సేంద్రియ సేద్యం ఎంతో మేలని, దీన్ని అనుసరిస్తే భవిష్యత్ తరాలకు ఎంతో లబ్ధి చేకూర్చినట్టని అధికారులు సూచిస్తున్నారు. గో ఆధారిత సేద్యంతో పెట్టుబడి ఆదా, దిగుబడి మెండుగా ఉంటుందని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

చౌడు భూములయ్యే ప్రమాదం



భూసార ఫలితాల ఆధారంగానే ఎరువులు, పురుగు మందులను వినియోగించాలి. అనవసరంగా మోతాదుకు మించి వాడితే భూమి నిస్సారమై, కొన్నేళ్లకు పంటలకు పనికిరాని చౌడు నేలలుగా మారే ప్రమాదం ఉంది. ఎరువుల వినియోగంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. సాగులో రసాయనాల వాడకం తగ్గించుకోవాలి.

– ఎం రామారావు, ఏడీఏ, అనకాపల్లి

బుద్ధుని మార్గం శిరోధార్యం


నెహ్రూచౌక్ వద్ద బుద్ధుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దాడి రత్నాకర్


సబ్‌జైలులో బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గణేష్‌రెడ్డి

అనకాపల్లిటౌన్ : ప్రతిఒక్కరూ గౌతమ బుద్ధుడు చూపిన శాంతిమార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం బుద్ధ జయంతి వేడుకలు జరిగాయి. స్థానిక నెహ్రూచౌక్‌లో బుద్ధుని విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు దూలం బుసిరాజు, ఉపాధ్యక్షుడు బండి అప్పారావు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబ్జీ, ప్రజాసంఘాల నేతలు చిన్నియాదవ్, ఆళ్ల ప్రవీణ్‌కుమార్, బొడ్డేడ అప్పారావు, బొబ్బిలి గోవిందరాజు, వాసుపల్లి తాతయ్యలు, రేబాక ఇంద్రకుమార్ పాల్గొన్నారు.

- స్థానిక సబ్‌జైలు ఆవరణలో సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. జైలు సూపరింటెండెంట్ వై.ఎస్.గణేష్‌రెడ్డి బుద్ధుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు బుద్ధుని బోధనలు సమాజానికి మార్గదర్శకాలు అనే అంశంపై ఖైదీలకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన వారికి గణేష్‌రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందించారు. అంతకు ముందు ఖైదీలకు మిఠాయిలు, బిస్కెట్లను అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం పంపిణీ చేశారు.

'ఒక్క రోజులో ఉపాధి జాబ్ కార్డు'


మహిళా సమాఖ్య సమావేశంలో మాట్లాడుతున్న ఉపాధి పథకం ఏపీవో శివ

కశింకోట : ఉపాధి హామీ పథకంలో ఇంకా ఎవరికైనా జాబ్ కార్డు కావాలంటే దరఖాస్తు చేసిన ఒక్క రోజులో కార్డు అందిస్తామని పథకం ఏపీవో శివ తెలిపారు. మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ అధ్యక్షతన శుక్రవారం కశింకోటలో జరిగిన మహిళా సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. జాబ్ కార్డు పొందేందుకు ఆధార్, బ్యాంకు అక్కౌంట్ పాస్‌బుక్ జెరాక్స్ కాపీలతో వీఆర్పీలకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల్ని పరిశీలించి, తక్షణమే కార్డు మంజూరు చేస్తామని, కుటుంబానికి వంద రోజుల పని కల్పిస్తామని తెలిపారు. ఉద్యానవన పంటలపై ఆసక్తి ఉన్న వారు మామిడి, జీడిమామిడి, కొబ్బరి పంటల సాగుకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా స్వయం సహాయక సంఘాల పని తీరుపై సమావేశంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు సమీక్ష నిర్వహించారు. ఎల్‌సీసీ శ్రీనివాసరావు, సమాఖ్య కార్యదర్శి అప్పలనరసమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

దైవ చింతనతో మానసిక ప్రశాంతత


గౌరీ పంచాయతన ఆలయం వద్ద అన్నసమారాధనను ప్రారంభిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాల ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్ అన్నారు. గౌరీ పంచాయతన ఆలయం 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని లలితాదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు, హోమాలు తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ చాలా ఒత్తిళ్లకు గురవుతున్నారని, వాటన్నింటినీ దైవచింతన ద్వారా దూరం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, వార్డు ఇన్‌చార్జిలు కొణతాల భాస్కర్, పీలా రాంబాబు, గవర కార్పొరేషన్ డైరెక్టర్ శిలపరశెట్టి బాబీ, పార్టీ నేతలు చదరం వెంకటరావు, బుద్ద సతీష్, కాండ్రేగుల సత్యనారాయణ, ఆడారి త్రినాథరావు, బుద్ద సందీప్, వినయ్, బుద్ద శ్రీను, పట్టణ చిల్లరవర్తక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బీమా తక్షణ సాయం అందజేత


పీలా గౌరికి తక్షణ సాయం అందిస్తున్న భాస్కర్

అనకాపల్లిటౌన్ : పేదల పాలిట వైఎస్సార్ బీమా వరంగా మారిందని 80వ వార్డు ఇన్‌చార్జి కొణతాల భాస్కర్ అన్నారు. వార్డు పరిధిలో గవరపాలేనికి చెందిన పిళ్లా సూర్యప్రకాశరావు మృతి చెందడంతో ఆయన భార్య పీలా గౌరి ఇంటికి చేరుకుని శుక్రవారం దహన సంస్కారాల నిమిత్తం రూ.10 వేలు తక్షణ సాయం అందించారు. మిగిలిన రూ.90 వేలు త్వరలోనే బ్యాంక్ ఖాతాలో జమకానున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవానికి ప్రాధాన్యమివ్వండి


జేసీ జాహ్నవిని కలిసిన డీవీఎంసీ సభ్యులు

తుమ్మపాల : ప్రతి నెల జరిగే పౌరహక్కుల దినోత్సవానికి ప్రాధాన్యత కల్పించాలని డీవీఎంసీ సభ్యులు శుక్రవారం ఎస్పీ మురళీకృష్ణ, జేసీ జాహ్నవిలను కలిసి వినతిపత్రం అందించారు. ఇటీవల నూతనంగా విధుల్లో చేరిన ఇరువురికి ముందుగా శుభాకాంక్షలు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ భూసమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కోరారు. పౌరహక్కుల దినోత్సవం ఆయా గ్రామాల్లో పౌరులకు అవగాహన కలిగే విధంగా నిర్వహించాలని సూచించారు. సమావేశాలకు పోలీస్ శాఖ నుంచి ఎస్‌హెచ్‌వో హాజరయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మార్తి అప్పలరాజు, రేబాక మధుబాబు, గంగాధర్, యోగిరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకస్వాములు


భక్తి తన్మయత్వంలో గ్రామస్తులు

కశింకోట : స్థానిక సర్వమంగళాంబ సమేత త్రిపురాంతకస్వామి ఆలయంలో శుక్రవారం శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఏటా వైశాఖ మాసం పౌర్ణమి రోజు వార్షిక కల్యాణాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శివ పార్వతుల ఉత్సవ విగ్రహాలను అందంగా అలంకరించి శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ సంప్రదాయంగా కల్యాణం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని ఆద్యంతం తిలకించి, పులకితులయ్యారు. ఆలయ ప్రాంగణం శివ నామస్మరణతో మార్మోగింది. ఆలయ అర్చకులు వి.శంకరం, చిదంబరం, కృష్ణల ఆధ్వర్యంలో కల్యాణాన్ని నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

ప్రతి శుక్రవారం స్పందనపై సమీక్ష

- గంటన్నరపాటు నిర్వహణ-ఆర్డీవో చిన్నికృష్ణ


అర్జీదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

అనకాపల్లిటౌన్ : డివిజన్ పరిధిలో స్పందన అర్జీల పరిష్కారానికి నిర్దేశిత గడువుతో సంబంధం లేకుండా సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని ఆర్డీవో చిన్నికృష్ణ అన్నారు. జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి వర్చువల్ సమావేశంలో భాగంగా స్థానిక ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఆయన అర్జీదారులనుద్దేశించి మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్, జేసీ, ఎస్పీలు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న స్పందన అర్జీదారుల సమావేశం భవిష్యత్‌లో ప్రతి శుక్రవారం ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందన్నారు. సమావేశంలో జిల్లాస్థాయిలో జిల్లా కలెక్టర్, జేసీ, ఎస్పీ, డివిజన్ స్థాయిలో ఆర్డీవో, డీఎస్పీ, మండల స్థాయిలో తహసీల్దార్, ఎంపీడీవో, సీఐలు, మండల సర్వేయర్ల సమన్వయంతో స్పందన అర్జీలను త్వరితగతిన ఎక్కడికక్కడ పరిష్కారానికి చర్యలు చేపడతామన్నారు. స్పందన అర్జీల పరిష్కార సంతృప్తి శాతాన్ని పెంచుతామని స్పష్టం చేశారు. పరిష్కారానికి నోచుకోని అర్జీదారులకు కారణాలను కూడా తెలియజేస్తామన్నారు. అంతకుముందు 20 మందికి పైగా అర్జీదారులతో ఆర్డీవో, డీఎస్పీలు మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు. కార్యక్రమంలో డీఎస్పీ సుబ్బరాజు, సమాచార హక్కు, వినియోగదారుల రక్షణ చట్టాల ఉద్యమకర్త కాండ్రేగుల వెంకటరమణ, వ్యవసాయదార్ల సంఘం కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామీణాభివృద్ధి

- గడప గడపకు మన ప్రభుత్వంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్
- పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభం, శంకుస్థాపన


సమస్యలను తెలుసుకుంటున్న మంత్రి అమర్‌నాథ్


ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాల బ్రోచర్‌ను మహిళకు అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్


పేరంటాలపాలెంలో అంతర్గత సిమెంట్ రోడ్లు ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

కశింకోట : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవిరళ కృషి చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. మండలంలోని పేరంటాలపాలెంలో శుక్రవారం ‹గడప గడపకు మన ప్రభుత్వం› కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై రూపొందించిన కర పత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబాల వారీగా సంక్షేమ లబ్ధిని వివరించారు. రూ.15 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన సచివాలయ పరిధిలో రూ.20 లక్షలు చొప్పున నిధులను కేటాయించినట్టు తెలిపారు. ఆ నిధులతో గ్రామాల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం తదితర స్థానిక ప్రజల అభ్యర్థన మేరకు పనులు చేపడుతున్నట్టు వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు, రైతు భరోసా, అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, విద్యా దీవెన తదితర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నట్టు పేర్కొన్నారు. అర్హులైనప్పటికీ, సంక్షేమ పథకాలు అందకపోతే అవసరమైన ధ్రువపత్రాలతో సమీప సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సిందిగా సూచించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, అర్హులైన ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంక్షేమ, అభివృద్ధి పథకాలతో రాష్ట్రాన్ని ప్రగతి పథం వైపు నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ అధికారంలోకి తీసుకురావడానికి రానున్న ఎన్నికల్లో తమ సంపూర్ణ మద్దతు అందించాలని ప్రజల్ని అభ్యర్థించారు. ఈ సందర్భంగా రామాలయ నిర్మాణానికి జెడ్పీ నిధుల నుంచి రూ.10 లక్షలు మంజూరు చేస్తామన్నారు. స్థానిక పాఠశాలను పరిశీలించారు. మూడో విడత నాడు-నేడు కార్యక్రమంలో పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి అమర్‌నాథ్ అధికారులను కోరారు. మౌలిక సదుపాయాల కల్పనకు అధికారులు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అభివృద్ధిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మార్కు స్పష్టంగా కనిపించాలన్నారు. వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు సకాలంలో చెల్లింపులు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికల తర్వాత గ్రామాల్లో ప్రజలకు కనిపించారా? అని ప్రశ్నించారు. వారు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయకపోగా ప్రజలకు చేరువగా విశేష సేవలందిస్తున్న సీఎం జగన్ ప్రభుత్వాన్ని విమర్శించడం శోచనీయమన్నారు. వీటిని ప్రజలు విశ్వసించరని, పారదర్శక పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ అధికారంలోకి తీసుకురావడం ఖాయమన్నారు. రైతు భరోసా కేంద్రంలో 40 శాతం రాయితీతో ముగ్గురు రైతులకు మంజూరైన పవర్ టిల్లర్లు, దమ్ము నాగళ్లను ఆయన పంపిణీ చేశారు.

గ్రామంలో మంత్రి నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పూలదండలు వేసి దుశ్శాలువాలు కప్పి ప్రజలు ఘన స్వాగతం పలికారు. మహిళలు అడుగడుగునా మంగళ హారతులు పట్టారు. ఉప సర్పంచ్ వజ్రం నాగశ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ కలగా లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, పార్టీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివాసరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, సర్పంచ్ పువ్వల సన్యాసిరావు, ఎంపీటీసీ సభ్యుడు మంగతాయారు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మి, పాల సంఘం అధ్యక్షుడు జగతా సత్తిబాబు, స్థానిక నాయకులు ఉండూరి గోవింద, నూనె సంతోష్, సేనాపతి యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శ్రీకారం


మినీ వాటర్ ట్యాంకు, బోర్‌వెల్ పనులకు శంకుస్థాపన చేస్తున్న దంతులూరి దిలీప్ కుమార్

అనకాపల్లి రూరల్ : తుమ్మపాల 6వ వార్డు యాతపేటలో మినీ వాటర్ ట్యాంకు, బోర్‌వెల్ పనులకు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ మేరకు జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్ కుమార్ భూమి పూజ చేసి, కొబ్బరి కాయ కొట్టి పనులను ప్రారంభించారు. మినీ వాటర్ ట్యాంకు, బోర్‌వెల్ పనులు పూర్తయితే యాతపేట ప్రజల కష్టాలు తీరుతాయని దిలీప్ కుమార్ అభిప్రాయపడ్డారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సంక్షేమం, అభివృద్ధి సమానంగా జరుగుతున్నాయన్నారు. ప్రజలకు మేలు చేసే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్యకుమారి, విల్లూరి చంద్రశేఖర్, ఎంపీటీసీ పంచదార్ల కన్నారావు, రామ్‌కుమార్, బొడ్డపాటి చిన్న రాజారావు, ఆర్టీసీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ చదరం చిన్న, వార్డు మెంబర్లు మాదిబోయిన నాగరాజు, వెలగా నూకరత్నం, వెలగా మోదినాయుడు, యనమశెట్టి రామారావు, పొలమరశెట్టి కృష్ణ, రవ్వ శ్రీను, తత్ర సత్యారావు, కొణతాల అర్జున్, పలువురు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జోగారావుపేటలో 'గడప గడపకు' నేడు

కశింకోట : మండలంలోని పేరంటాలపాలెం శివారు జోగారావుపేటలో శనివారం ఉదయం 8 గంటలకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగనుందని ఎంపీపీ కలగా లక్ష్మి తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరై ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రచారం నిర్వహిస్తారని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అభిమానులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిందిగా కోరారు.

ఆయుర్వేదం, యోగా శిక్షణపై సప్తాహం

అనకాపల్లిటౌన్ : మండలంలోని కోడూరు గ్రామంలో ఆరోగ్య ధాత్రీ ఆయుర్వేద పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో 7వ ఆయుర్వేదం, యోగా శిక్షణ సప్తాహంను నిర్వహించనున్నట్టు సంస్థ సభ్యులు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20 నుంచి 26 వరకు ఈ కార్యక్రమం జరపనున్నట్టు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

విస్తృతంగా ధార్మిక కార్యక్రమాలు

పరవాడ: ప్రతీ దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి నిర్వహించడానికి భక్తులు ముందుకు రావాలని ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ ధర్మ ప్రచారక్ వెన్నల అప్పలనాయుడు కోరారు. పరవాడలో శుక్రవారం ఏర్పాటు చేసిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ఆలయాలకు చేరుకొని సామూహిక హారతి సమర్పించాలన్నారు. అదేవిధంగా వారం వారం భజన కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఏకాదశి రోజు గ్రామ ప్రజలు నగర సంకీర్తన నిర్వహించాలని సూచించారు.